“గుమ్మంలో అడుగు పెట్టిపెట్టగానే ఏంటండీ ఆ పాడు తిట్లూ పాపం ” అంది పార్వతమ్మ.

“నావి పాడు తిట్లయితే ఏమైనా మంచి  తిట్లు చెప్పరాదూ? ఆ తిట్లే తిడతాను”

“అది కాదురా అబ్బాయ్. ఇలా కూర్చో... నీతో ఓ మంచి విషయం చెప్పాలి” అంది పార్వతమ్మ.

బుచ్చిబాబు వాళ్ళ దగ్గర కూర్చున్నాడు.

“ఏంటో నీ మొహం చూస్తుంటే నువ్వెంత బాధపడుతున్నావో తెలుస్తుంది. ఆ సీత సంబంధం పోతే పోయింది. ఒట్టి వగలమారిది, దరిద్రపు గొట్టుది”.

పార్వతమ్మ సీతని అలా తిడుతుంటే బుచ్చిబాబుకి చాలా బాధేసింది.

“ఏంటమ్మా సీతని ఊర్కే అలా ఎందుకు తిడతావు?” అన్నాడు వారిస్తూ.

“ఊర్కే తిట్టడానికి నాకేమయినా నోటి దురదా ఏంటి నేను కాబట్టి మామూలు తిట్లు తిడుతున్నా... అదే మీ నాన్నగాడిలాంటోళ్ళు పచ్చిబూతులు తిడతారు. అలాంటి నీతీ జాతీలేని వాళ్ళని”

“ఏం నీ కంటికి నేను బూతులు మాట్లాడే అలగా వెధవలా కనిపిస్తున్నానా?” విసుగ్గా భార్యవంక చూస్తూ అన్నాడు పర్వతాలరావు.

“అయినా సీత పర్సనల్ విషయాల గురించి, ఆమె క్యారెక్టర్ గురించీ మనకి అనవసరం. ఆమె సంబంధం వద్దని అనుకున్నప్పుడు ఆమె గురించి మనకెందుకు?” అన్నాడు బుచ్చిబాబు
.

“అదీ నిజమేలే బాబూ” దీర్ఘాలు తీస్తూ అంది పార్వతమ్మ.

“అయినా అసలు విషయం చెప్పడం మాని ఇంకేంటేంటో మాట్లాడతావేం?” మిర్రి మిర్రి చూస్తూ అన్నాడు పర్వతాలరావు.

“అదేరా.... మీ సూర్యం మామయ్యలేడూ?” అంది పార్వతమ్మ.

“ఏదీ...ఎప్పుడూ సిల్లీగా మాట్లాడే అ నీచ నికృష్టమయిన మామయ్యేనా?” అడిగాడు బుచ్చిబాబు.

“ఛాల్లే ఊర్కోరా.... అతను నీచ నికృష్టుడు ఎందుకయ్యాడు...... పాపం చాలా మంచాడ్రా”

“వీడికంతేలే ప్రతి వెధవా నీచ నికృష్టుడిలానే కనిపిస్తాడు” పళ్ళు నూరాడు పర్వతాలరావు.

“అయినా అతడు మంచివాడైతేం నాకేం కాకపోతే నాకేం?” అన్నాడు బుచ్చిబాబు.

“నీకు కాకపోతే మరెవరికిరా? సూర్యం మామయ్య కూతురు నీకు తెలుసుగా?”

“నాకు తేలీదు”

“తెలియకపోయినా పర్లేదు. బంగారు బొమ్మలా వుంటుంది. అసలు ఆ పిల్ల గురించే

మనకి ఇన్నాళ్ళూ గుర్తుకు రాలేదు. ఈవేళ ఏమీ తోచక పోటో అల్బంలు చూస్తుంటే ఆ ఆమ్మాయి పోటో కనిపించింది.” చెపుతు అంది పార్వతమ్మ .

“ఇప్పుడు ఆ విషయాలన్నీ నాకెందుకు చెపుతున్నారు?” అనుమానంగా చూస్తూ అడిగాడు బుచ్చిబాబు.

“ఆ సీత సంబంధం ఏలాగూ తప్పిపోయింది. నువ్వు సూర్యం మామయ్య కూతుర్ని చెసుకుంటే బాగుంటుందనీ”

“బాగుంటుందా? ఎవరికి, నాకా, మీకా, సూర్యం మామయ్యకా లేకపోతే ఆ అమ్మాయికా?” విసుగ్గా ఆడిగాడు బుచ్చిబాబు.

“ఏమేవ్ ఈ వెధవకి కాస్త పైత్యం ముదిరినట్టుంది. అల్లం రసం ఇవ్వు” అన్నాడు పర్వతాలరావు.

“అయితే. ఇప్పుడు నువ్వేమంటావ్ రా? ఆ పనికిమాలిన పిల్ల అలా చేసిందని బాధపడుతూ జీవితాంతం పెళ్ళీ పెటాకులూ లేకుండా ఉంటావా?” అడిగింది పార్వతమ్మ .

“అలాగని నేననలేదే. ప్రస్తుతానికి నాకు పెళ్ళి చేసుకునే మూడ్ లేదు. ఇంక ఆ విషయం గురించి నా దగ్గర సిల్లీగా ప్రస్తావించకండి”

బుచ్చిబాబు చివాలున లేచి చకాచకా తన గదిలోకి వెళ్ళిపోయాడు.

“సన్నాసెదవా, తింగరెదవ, పనికిమామలిన యదవ” తిట్లు లంకించుకున్నాడు పర్వతాలరావు.

రాత్రి బుచ్చిబాబుకి నిద్రపట్టలేదు. అతని బుర్రనిండా ఎన్నో ఆలోచనలు, అసలే ట్రాన్స్ఫర్ ప్రాబ్లెం ఒకటి తన బుర్రని తొలిచేస్తుంటే వాళ్ళు ఓ ప్రక్కన సంబంధాలు చూసి పెళ్ళికి బలవంతం చేసి చంపేసేలా వున్నారు.

ఇలాగయితే లాభంలేదు. తన ట్రాన్స్ఫర్ విషయం త్వరగా తేల్చేసి విజయవాడ వెళ్ళి సీతతో కాపురం పెట్టెయ్యాలి.

కానీ ఎలా?

ఏకాంబరం కంప్లైంట్ చేయడు. పైగా అర్ధంకాని బూతులు తిడతాడు. మినిస్టర్ మిన్నారావు అసలే కుదరదని అన్నాడు.

మరి తన సమస్య తీరేదెలా? ఎవరు ట్రాన్స్ఫర్ చెయిస్తారు...ఎవరు?

ఎవరు? ?

ఎవరు ? ? ?

హఠాత్తుగా అతని బుర్రలో మెరుపులాంటి అలోచన వచ్చింది.

బ్లాక్మెయిల్!

బ్లాక్మెయిల్!

అవును.....

తన సమస్యకి పరిష్కారం!! అనుకున్నాడు బుచ్చిబాబు.

న్యూస్ పేపర్ చూస్తున్న మినిస్టర్ మిన్నారావ్ ఆనందంగా కేక పెట్టాడు.

"ఏమేవ్ ఇలారా!"

వెంకటలక్ష్మి ఆ అరుపుకి హడావిడిగా హాల్లోకి వచ్చింది.

"ఏమేవ్ ఏటీ.. నేనెవర్నేటి?" చిరాగ్గా మొహం పెట్టి అడిగింది వెంకటలక్ష్మి.

"ఎవరేంటి నీ బొంద... నువ్వు నా పెళ్ళానివి" అన్నాడు మిన్నారావ్.

"కాదు"

మిన్నారావ్ ఉలిక్కిపడి వెంకటలక్ష్మి వంక చూశాడు.

"ఏంటేవ్ కొంపదీసి నాకు విడాకులిచ్చేద్దామని అనుకుంటున్నావా ఏందీ?"

"సీ... అదేంకాదు! నేను మినిస్టర్ పెళ్ళాన్ని! అందుకే ఈ సుట్టుపక్కలోళ్ళు ఎంతో గౌరవం ఇస్తారు. అట్టాంటిది మీరు ఊర్కే ఒసేవ్, ఏమేవ్ అంటే బాగుంటదాంట!" సిగ్గుపడ్తూ అంది వెంకటలక్ష్మి.

మినిస్టర్ మిన్నారావ్ గడగడ నవ్వాడు.

"ఓసినీ...అదా నీ బాధా! అట్టాగేలే. ఇకముందు ఓ మినిస్టర్ పెళ్ళామా అని పిలుస్తాలే....." నవ్వుతుంటే నోట్లోంచి కార్తున్న చొంగ తుడుచుకుంటూ అన్నాడు.

"సాల్లే సంబడం.... ఇంతకీ నన్నెందుకు పిలిశారో?"

"నిన్న అమీర్‌పేట్‌లో చికెన్ సెంటర్ ఓపెన్ చేసిన ఫోటో... ఈ వైపు నేను చికెన్ సెంటర్ ఓపెన్ చేసిన ఫోటో...."

"అయితే మీరు ప్రదానమంత్రి అంతటోడు అయిపోయారన్నమాట!" బుగ్గలు నొక్కుకుంటూ అంది వెంకటలక్ష్మి.

"మరే" గర్వంగా అన్నాడు మిన్నారావ్.

"మీరు సికెన్ పీక తెగ్గోస్తూ ఓపెనింగ్ సేసినట్లు ఫోటో తీశారు గానీ... ఆళ్ళజిమ్మడ మీరు నవ్వుతున్నప్పుడు ఫోటో తియ్యొచ్చు కదా!"

"కెమెరా బటన్ నొక్కడానికి చూపుడేలు వుంటే చాలు ఫోటోలు తీసెయ్యొచ్చు అనుకుంటారు నాయాళ్ళు. నేను చికెన్ పీక కొయ్యడంలో వున్నా. అప్పుడు ఆ ఫోటోగ్రాఫర్ రెడీ అంటే నేను నవ్వి వుండేవాడిని కదా?" బాధపడుతూ అన్నాడు మినిస్టర్ మిన్నారావ్.

"సన్నాసెదవలు!" తిట్టింది వెంకటలక్ష్మి.

ఆ టైంలో హాల్లోకి ఎవరో వచ్చిన అలికిడికి ఆ ఇద్దరూ తల తిప్పి చూశారు.

బుచ్చిబాబు....

అతని చేతిలో మడిచిన న్యూస్ పేపర్లు!

"హారి! నువ్వా!? మళ్ళీ వచ్చావ్?! నీ ట్రాన్స్‌ఫర్ విషయంలో నేనింక ఏమీ పట్టించుకోనని చెప్పా కదయ్యా. రికమెండేషన్ చెయ్యడానిక్కూడా సరైన పద్దతుండాలి! ఓసారి ట్రాన్స్‌ఫర్

ఆపు, ఇంకోసారి ట్రాన్స్‌ఫర్ చెయ్యి అంటూ రికమండేషన్లు చేస్తే నన్నో హౌలాగాడిననుకుంటారు!" మొహం చిట్లిస్తూ అన్నాడు మినిస్టర్ మిన్నారావ్.

"అదికాదండీ. మీకు ఈ న్యూస్ పేపర్లు చూపిద్దామని తెచ్చా..." అన్నాడు బుచ్చిబాబు .

మినిస్టర్ మిన్నారావ్ మొహం వెలిగింది.

"ఓ .. న్యూస్ పేపర్లలో కూడా నా చికెన్ సెంటర్ ఓపెనింగ్ ఫోటోలు పడ్డాయా! నేను నవ్వుతున్నప్పుడు ఫోటోలు తియ్యలేదయ్యా నాయాళ్ళు? ఏదీ ఏదీ ఇలాతే" సంబరంగా అంటూ చెయ్యి ముందుకు చాపాడు.

బుచ్చిబాబు తన చేతిలోవున్న న్యూస్‌పేపర్లలో ఒకదానిని మినిస్టర్ మిన్నారావు చేతికి అందించాడు.

అది పాత న్యూస్ పేపర్.

"ఏంటిది....పాత న్యూస్ పేపర్లా వుంటే...ఇందులో నేను కిళ్ళీషాపు ఓపెనింగ్ చేసిన ఫోటో ఏదైనా పడిందా?" అడిగాడు మిన్నారావ్.

"కాదు.... పేజీ తిప్పి లోపల చూడండి"

మినిస్టర్ మిన్నారావ్ పేజీ తిప్పి చూశాడు. వెంకటలక్ష్మి కూడా కుతుహలంగా ముందుకు వంగి న్యూస్ పేపర్లలోకి తొంగి చూసింది.

అక్కడ రాజకీయ నాయకుడు రాజేంద్ర దారుణంగా హత్య చేయబడిన న్యూస్ వుంది. అది చూడగానే మినిస్టర్ మిన్నారావ్ మొహంలో రంగులు మారాయ్.

అతని మనసులో ఎన్నో సందేహాలు..... ఒక్క క్షణంలో!

"నువ్వెందుకిక్కడ ....లోపలకెళ్ళి పనులు చూసుకో......" పెళ్ళాం వైపు తిరిగి విసుగ్గా అన్నాడు మిన్నారావ్.

"పిల్చేది నువ్వే.....ఇసుక్కునేది నువ్వే......సంపేత్తున్నావ్ కదా....." విసుక్కుంటూ లోపలికెళ్ళిపోయింది వెంకటలక్ష్మి.

మినిస్టర్ మిన్నారావు బుచ్చిబాబు వంక చూశాడు.

"ఇంతకి ఈ న్యూస్ పేపర్ నాకెందుకు చూపిస్తున్నావో నాకర్థం కావడంలేదు!"

"మీరు మర్చిపోయారా సార్! నేను పోయినసారి నా ఫ్రెండ్‌తో కలిసి మీ దగ్గరకి వచ్చినప్పుడు మేము ఇంకెవరమో అనుకుని రాజేంద్ర ఫోటో మాకిచ్చి దాంతోపాటు డబ్బు కూడా ఇచ్చి అతన్ని సఫా చెయ్యమని చెప్పారు".

మినిస్టర్ మిన్నారావ్ మొహంలో ఫీలింగ్స్ గమనిస్తూ అన్నాడు బుచ్చిబాబు. బుచ్చిబాబు ఊహించినట్టుగానే మినిస్టర్ మిన్నారావ్ మొహం మాడిన పెసరట్టులా అయింది.

"ఆ తర్వాత ఈ పేపర్లో రాజేంద్ర దారుణ హత్యకి సంబంధించిన వార్తని చదివాను" మెల్లగా అన్నాడు రాజేంద్ర.

మినిస్టర్ మిన్నారావ్‌కి మాట పడిపోయింది. గుడ్లు మిటకరిస్తూ బుచ్చిబాబు వంక

చూశాడు.

అవును.... తను ఆ రోజు జరిగిన విషయం గురించి మర్చిపోయాడు. పొరపాటున రాజేంద్ర ఫోటోని వాళ్ళకి ఇవ్వడం, వాడిని హత్య చేయమని చెప్పడం....

ఎంత పొరపాటైపోయింది. వీడికి ఆ హత్య రహస్యం తెలుసు. ఇంతకీ వీడు ఎందుకొచ్చినట్టు???

ఆ విషయాన్నే అడిగాడు మినిస్టర్ మిన్నారావ్.

"ఇంతకి నువ్వెందుకు వచ్చావ్?"

"ఏంలేదు సార్...... ఆ రోజు జరిగింది తల్చుకుంటే మీరే రాజేంద్రని చంపించారని ఎలాంటి సిల్లీ ఫెలోకైనా అర్థం అవుతుంది. కానీ నేను మాత్రం మీరు చంపించారని అనుకోవడంలేదు" కొన్ని క్షణాలు ఆగి మళ్ళీ ఇలా అన్నాడు "ఎందుకైనా మంచిది అని మిమ్మల్ని హెచ్చరించాలని వచ్చాను..... ఇదిగో ఈ న్యూస్ పేపర్ చూడండి. రాజేంద్ర హత్య కేసుని సిబిఐ వాళ్ళు టేకప్ చేసినట్లు పేపర్‌లో వేశారు...అయినా ఆ వార్తని మీరు చూసే వుంటారు. ఏదో మీమీద అభిమానం కొద్దీ మీతో చెప్పిపోదామని వచ్చాను" అంటూ చేతిలోని న్యూస్ పేపర్‌ని మిన్నారావ్‌కి ఇచ్చాడు.

మిన్నారావ్ న్యూస్‌పేపర్లోని వార్తని పాలిపోయిన మొహంతో చదివాడు.

"నేనిక వస్తాను సార్" వెనక్కి తిరిగాడు బుచ్చిబాబు.

"ఆగవోయ్ ఆగు" కంగారుగా అన్నాడు మిన్నారావ్ బుచ్చిబాబు ఎందుకొచ్చాడో అర్థంకాని తింగరోడు కాదు మినిస్టర్ మిన్నారావ్.

బుచ్చిబాబు ఆగాడు.

"రా....రా.... కూర్చో! పాపం నామీద అభిమానంతో అంత దూరం నుండి వచ్చావ్. హి.....హి.....హి!" బలవంతంగా నవ్వు తెప్పించుకుని నవ్వుతూ అన్నాడు మినిస్టర్ మిన్నారావ్.

బుచ్చిబాబు మినిస్టర్ మిన్నారావ్ ఎదురుగా సోఫాలో దర్జాగా కూర్చున్నాడు.

అప్పుడే ఫోన్ మోగింది.

"హలో ......ఆ నేనే? మిన్నారావ్‌ని మినిస్టర్ మిన్నారావ్‌ని! బ్రోతల్ హౌస్ ఓపేనింగా? అబ్బ ఇప్పుడు కాదులేవయ్యా.... ఓ ముఖ్యమైన మీటింగ్‌లో వున్నా.... తర్వాత ఫోన్ చెయ్యి....." అంటూ ఫోన్ పెట్టేశాడు మిన్నారావు.

"చెప్పు బుచ్చిబాబు ....ఏం -తాగుతావ్? కాఫీయా, కూల్‌డ్రింకా?" అడిగాడు మినిస్టర్ మిన్నారావ్ బుచ్చిబాబుని.

"అబ్బే.....ఏం వద్దులేండి..నేను వెళ్తాను. అసలే మీరు బ్రోతల్ హౌస్ ఓపెనింగ్‌కి కూడా వెళ్ళాలి" సోఫాలోంచి లేవబోతూ అన్నాడు బుచ్చిబాబు.

"కూర్చో కూర్చో.... సరేగానీ నిన్నేదో అడిగావే.... నీ ట్రాన్స్‌ఫర్ విషయం గురించి ఏంటది? మళ్ళీ నిన్ను విజయవాడకే వేయించాలని కదూ?" ముందుకు వంగి బుచ్చిబాబు

మొహంలోకి చూస్తూ అడిగాడు మినిస్టర్ మిన్నారావ్.

0 0 0

సీత పకపకా నవ్వింది.

"అయితే మినిస్టర్ మిన్నారావ్‌గారిని భలే ఏడిపించావన్నమాట" అంది నవ్వాపుకుంటూ.

"మరి? లేకపోతే నాతోనే అమర్యాదగా మాట్లాడ్తాడా?" అన్నాడు బుచ్చిబాబు.

"అయితే నీకు విజయవాడకి ట్రాన్స్‌ఫర్ తప్పకుండా చేయిస్తాడంటావా"

"చచ్చినట్టు! ఎవరికోసం!!"

కొన్ని క్షణాలు ఆగి సీత సందేహంగా ఇలా అంది "వాడు నీకేం హాని తలపెట్టడు కదా?"

"వాడా? భలేదానివే? నేనంటేనే భయపడి చస్తున్నాడు సిల్లీఫెలో. వాడి జుట్టు నా చేతిలో వుంది.... చూస్తూ వుండు. మరో వారం రోజుల్లో ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ నా చేతిలో వుంటుంది" గర్వంగా అన్నాడు బుచ్చిబాబు.

"నిజంగానా?"

"ఊ.....ట్రాన్ఫర్ ఆర్డర్ రాగానే ఇక్కడ రిలీవ్ అయిపోయి మనం విజయవాడ వెళ్ళిపోదాం...... " ఉత్సాహంగా అన్నాడు బుచ్చిబాబు.

కొన్ని క్షణాల నిశ్శబం తరువాత సీత బుచ్చిబాబు భుజంమీద ఒరుగుతూ మెల్లగా అడిగింది "బుచ్చీ...నన్ను అన్యాయం చేయవుగా?"

"లేదు సీత ...... నేనలాంటి సిల్లీ పన్లు ఎన్నటికి చెయ్యను" అన్నాడు బుచ్చిబాబు సీత తల నిమురుతూ.

"సార్....పార్క్ మూసేసే టైం అయ్యింది. మీరిక లేవాలి"

పార్కు కాపలావాడి మాటతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చారు ఇద్దరూ.

0 0 0

"ఎందుకు సార్ పిలిచారంట?" ఏకాంబరం ఎదురుగా నిలబడి అడిగాడు బుచ్చిబాబు.

ఏకాంబరం ఉలకలేదు పలకలేదు. నిలువు గుడ్లేసుకుని బుచ్చిబాబునే చూస్తున్నాడు.

"సార్.....మిమ్మల్నే సార్" స్వరం కాస్త పెంచి అన్నాడు బుచ్చిబాబు.

ఏకాంబరం కళ్ళు టపటపలాడించాడు.